

రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

● కార్పొరేటర్ సంగీతాశ్రీనివాస్‌యాదవ్

బంజారాహిల్స్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో వేగం పెంచడంతో పాటు నాణ్యత విషయంలో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్ యాదవ్ సూచించారు. ఎల్లారెడ్డిగూడ వడ్డెర బస్తీలో రూ.20 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డివిజన్‌లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులు పూర్తయిన తరువాత సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


మహేందర్‌రెడ్డికి పురస్కారం అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

డా. మహేందర్‌రెడ్డికి ఐఎంఏ జీవిత సాఫల్య పురస్కారం

బంజారాహిల్స్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైద్యుడు డాక్టర్ పన్యాల మహేందర్‌రెడ్డిని ఐఎంఏ జీవితసాఫల్య పురస్కారం వరించింది. నగరంలో జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జాతీయ సదస్సులో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మహేందర్‌రెడ్డికి ఈ పురస్కారాన్ని అందజేశారు. డాక్టర్ మహేందర్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సమాజంతో పాటు ఐఎంఏకు అందించిన సేవలకు ఈ పురస్కారం అందినట్లు తెలిపారు. జీవితసాఫల్య పురస్కారం దక్కడం ఆనందంగా ఉందని, ఇది తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఐఎంఏకు సెక్రటరీగా, అధ్యక్షుడిగా పనిచేయడంతో పాటు వైద్యం రంగంలో ఎదురైన ఎన్నో సవాళ్లను పోరాడి సాధించినట్లు తెలిపారు. ఓ వేదికను ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ హాస్పిటల్స్ వైద్యులు, నర్సింగ్ హోమ్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన వెల్లడించారు.


స్వామి నుంచి నియామకపత్రం అందుకుంటున్న గణేష్

పద్మశాలి సంఘం యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా గుండు గణేష్

బేగంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి సంఘం యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కుందన్‌బాగ్‌కు చెందిన గుండు గణేష్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇరావత్రి అనిల్, పద్మశాలి సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంబరి శ్రీనివాస్ సమక్షంలో సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి శనివారం గణేష్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. పద్మశాలీల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తానని, తనను ఉపాధ్యక్షుడిగా నియమించిన గణేష్ ధన్యవాదాలు అని గణేష్ పేర్కొన్నారు.

దళితులకు అండగా ఎంఐఎం

● ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్

ఖైరతాబాద్ డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దళితులు, మైనారిటీలు కలిసిమెలిసి ఉంటే దేశంలో తిరుగులేని శక్తిగా మారవచ్చని ఎంఐఎం ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శనివారం రాత్రి చింతల బస్తీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంఐఎం తొలి నుంచి దళితులకు అండగా ఉంటుందని, ఇప్పటివరకు తమపార్టీ ముగ్గురు దళితులను, ఇద్దరు ముస్లింలను మేయర్లుగా చేసిందన్నారు. దళితులకు అన్యాయం జరిగినప్పుడల్లా ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంట్‌లో, అసెంబ్లీలో అక్బరుద్దీన్ ఒవైసీ ప్రతిఘటిస్తున్నారని పేర్కొన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను దళిత ఎమ్మెల్యేలు ఎందుకు ఖండించడం లేదని ఆయన ప్రశ్నించారు. జై భీమ్ అని ఒక్క బీజేపీ ఎంపీ అయినా అన్నారా అనేది ఆలోచించాలన్నారు. సమావేశంలో మాజీ మేయర్ మజీద్ హుస్సేన్, జుల్ఫీకర్ అలీ, ఎంఐఎం కార్పొరేటర్లు, దళిత సంఘాల నేతలు రాజు వస్తాద్, ఘట్టయ్య, అనిల్ చంద్ర, నాగేశ్వరరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

శనిత్రయోదశి పూజలు


శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకుని ఖైరతాబాద్‌లోని శనీశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నయాసాల్ వేడుకలు.. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

● పబ్‌లు, రెస్టారెంట్లకు పోలీసుల హెచ్చరిక

● నిర్వాహకులతో సమావేశమైన పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్


పబ్‌లు, రెస్టారెంట్ల నిర్వాహకులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ విజయ్‌కుమార్

బంజారాహిల్స్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నయాసాల్ సంబరాలు మిన్నంటేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పబ్‌లు, రెస్టారెంట్లు పార్టీ ప్రియులను ఆకర్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. అయితే ఈ ఉత్సాహం విషాదంగా మారకుండా ఎప్పటికీ గుర్తుండాలంటే నిబంధనలను పాటించాలని పోలీసులు చెబుతున్నారు. పబ్‌లు, రెస్టారెంట్‌లు, కాఫీ సెంటర్‌లు, బార్‌లు, మద్యం షాపులు ఇలా ప్రతి ఒక్కరూ తమ సూచనలకు లోబడి నడుచుకోవాలని నిర్వాహకులకు సూచనలు చేస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులతో పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ శనివారం సమావేశమయ్యారు. నూతన ఏడాది వేడుకల సందర్భంగా ఎలాంటి నిబంధనలు పాటించాలనే విషయంపై అవగాహన కల్పించారు. గతంలో చోటుచేసుకున్న సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

పబ్‌లపై ప్రత్యేక దృష్టి..

పబ్‌లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. డ్రగ్స్‌కు కేంద్రంగా మారుతున్న పబ్‌లల్లో తరుచూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. పార్టీలో మజా పెంచేందుకు కొంతమంది డ్రగ్స్ వినియోగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుండటంతో నయాసాల్ రోజున కూడా తనిఖీలు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక సిబ్బందిని సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. అలాగే అమ్యూజ్‌మెంట్ లైసెన్స్‌లు లేనివారిపై దృష్టి సారించారు. ఈ లైసెన్స్ లేకపోతే సంగీతం ప్లే చేయకుండా ముందే హెచ్చరిస్తున్నారు. నయాసాల్ వేడుకలు పూర్తయ్యాక పార్టీ ప్రియులు రోడ్ల మీదకు వచ్చి హంగామా చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ప్రమాదాల నివారణకు..

బంజారాహిల్స్ జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. అర్ధరాత్రి సమయంలో యువత ఎక్కువగా మృత్యువాత పడుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. వీరిలో 95 శాతం మంది మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తూ మరణిస్తున్నారు. అందులో నయాసాల్ వేడుకలంటే మరింత ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. గతంలో నయాసాల్ వేడుకల్లో భాగంగా రోడ్డు ప్రమాదంలో సుమారు 20 మంది యువకులు ప్రాణాలను పోగొట్టుకున్నారు. ఈ ఏడాది అలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.

సమయానికి మూసేయాలి

పబ్‌లు, బార్‌ల నిర్వాహకులు నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. సమయానికి మూసివేయకపోతే కేసులు నమోదు చేయడంతో పాటు నిర్వాహకులను అరెస్టు చేస్తాం. నిబంధలనపై నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నాం. హెచ్చరికలు జారీ చేశాం.

- విజయ్‌కుమార్, పశ్చిమ మండలం డీసీపీ

ఇవీ నిబంధనలు

- పబ్, రెస్టారెంట్‌ల నిర్వాహకులు ఎంట్రన్స్ వద్ద మెటల్ డిటెక్టర్‌లను ఏర్పాటు చేసుకోవాలి. రక్షణ కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకోవాలి.
- మద్యం తాగిన వారిని డ్రైవింగ్ చేయడానికి అనుమతించకూడదు. అవసరమైతే నిర్వాహకులే ప్రైవేట్ డ్రైవర్లను నియమించి పార్టీకి వచ్చిన వారిని క్షేమంగా ఇంటికి పంపించాలి.
- పబ్‌లను అర్ధరాత్రి 1 తరువాత మూసివేయాలి. కేక్ కటింగ్ పూర్తయ్యాక పరిసరాల నుంచి పార్టీ ప్రియులను పంపించేయాలి.
- ఎమ్యూజ్‌మెంట్ లైసెన్స్ ఉన్న వారు మాత్రమే సంగీతం పెట్టాల్సి ఉంటుంది.
- మైనర్లను ఎట్టి పరిస్థితిల్లోనూ పబ్‌లోకి అనుమతింకూడదు. తల్లిదండ్రులతో వస్తే అనుమతించినా మద్యం సరఫరా చేయకూడదు.
- ఘర్షణలు చోటుచేసుకోకుండా భద్రత చర్యలు తీసుకోవాలి. సీసీ కెమెరాలతో పాటు ప్రైవేటు సిబ్బందిని సమకూర్చుకోవాలి.
- పార్కింగ్‌ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలి. రోడ్డు మీద పార్కింగ్‌కు అవకాశం లేదు.
- అనుమతికి మించి సమయం కంటే ఒక్క నిమిషం ఆలస్యం చేసినా బార్‌లు, మద్యం దుకాణాల నిర్వాహకులపై కేసుల నమోదు చేస్తారు.
- నంబర్ ప్లేట్ లేని వాహనాలు వస్తే అనుమతించకూడదు.
- వ్యక్తులు లేదా ఏదైనా వస్తువు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

● పీసీసీ ప్రధాన కార్యదర్శి నీలిమ


బల్కంపేట బీజేఆర్‌నగర్‌లో నిర్వహిస్తున్న సర్వే వివరాలను తెలుసుకుంటున్న కోట నీలిమ

అమీర్‌పేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నివాస గృహాలను అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు. ప్రజాపాలనలో భాగంగా శనివారం బల్కంపేటలోని బీజేఆర్ నగర్ ఇందిరమ్మ ఇళ్ల పథకంపై అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా నీలిమ అక్కడకు వెళ్లి సర్వే వివరాలను తెలుసుకున్నారు. అనంతరం స్థానికులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఆమె వెల్లడించారు. దశలవారీగా ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, రామేశ్వరం గోవింద్, మిరియాల నవీన్ రాజు, గోదాస్ నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

మచ్చలేని పారిశ్రామికవేత్త రతన్ టాటా


రతన్ టాటా జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సీనియర్ పాత్రికేయులు అమర్

పంజాగుట్ట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యాపార, పారిశ్రామికవేత్తలు తమ వంతు బాధ్యతగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కిందసేవా కార్యక్రమాలు చేయాలనే ఆలోచన దివంగత దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటాదేనని సీనియర్ పాత్రికేయులు డి.అమర్ అన్నారు. ఆయనకు భారతరత్న ఇవ్వడం సముచితం అని ఆయన పేర్కొన్నారు. ఈఫిల్ లైఫ్ ఆర్ట్ క్రాఫ్ట్, కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రతన్ టాటా జయంతి సందర్భంగా విద్య, వైద్యం, సామాజిక, వాణిజ్య, మీడియా, సినీ,సేవా రంగాలలో సేవలందిస్తున్న పలువురిని రతన్ టాటా స్మారక పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ.. వ్యాపారం అంటే అంటరానిదిగా చూస్తున్నారని, బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయేవారు వ్యాపారవేత్తలు అనే అభిప్రాయం ప్రజల్లో నెలకొందన్నారు. రతన్ టాటా తన జీవితంలో ఎలాంటి మచ్చ లేకుండా జీవించారని కొనియాడారు. ఆయన పేరే ఆయనకు పెద్ద బిరుదు అని, ప్రభుత్వాలు ఆయనకు భారతరత్న ఇస్తాయని ఆశిద్దామన్నారు. సామాజిక వేత్త రవీందర్ రెడ్డి, నిర్మాతలు విజయ్ వర్మ, బాబ్జీ, వ్యాపారవేత్త సత్యనారాయణ, రమేష్, బి.రాంచందర్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన పెరగాలి

● ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి


ట్రాన్స్‌ఫార్మర్‌లో వైరింగ్‌ను పరిశీలిస్తున్న నక్క యాదగిరి, ప్రైవేట్ కాంట్రాక్టర్లు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రజలు, కాంట్రాక్టర్లలో అవగాహన పెరగాలని తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి పేర్కొన్నారు. నాసిరకం విద్యుత్ పరికరాలు, తీగలతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని పలు ఎలక్ట్రికల్ వస్తువుల తయారీ కంపెనీల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర వస్తువుల తయారీ, నాణ్యతను ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈసీ రెడ్డి, సభ్యులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్‌లో పెద్దఎత్తున భారీ భవనాలు నిర్మాణమవుతున్న క్రమంలో ఆయా భవనాల్లో వినియోగించే విద్యుత్ తీగల నాణ్యత, ట్రాన్స్‌ఫార్మర్లు, అండర్ గ్రౌండ్ కేబులింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముందన్నారు.

రెండేళ్లుగా జరుగుతున్న అగ్నిప్రమాదాల్లో 60 శాతం నిర్లక్ష్యం కారణంగా జరిగితే, 40 శాతం ప్రమాదాలు విద్యుత్ తీగలు, పరికరాల నాణ్యత లోపాలతో జరిగినట్లు ప్రాథమికంగా తేలిందన్నారు. బీఐఎస్ ప్రమాణాలతో తయారు చేసిన ఎలక్ట్రిక్ ఉపకరణాలనే వినియోగించాలని లైసెన్స్ పొందిన ఎలక్ట్రీషియన్లతో మాత్రమే విద్యుత్ మరమ్మతులు చేయించాలని సూచించారు. అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు మహేందర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణకు 'డ్రగ్స్ ఫ్రీ వెల్‌నెస్' కోర్సు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపి, యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపాడేందుకు తెలంగాణ నార్కోటిక్ బ్యూరోను ఏర్పాటు చేశారు. మరోవైపు యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 'డ్రగ్స్ ఫ్రీ వెల్‌నెస్' పేరుతో ఆన్‌లైన్ కోర్సును అందుబాటులోకి తెచ్చారు. ఈ మేరకు ఎడిస్టీస్ ఫౌండేషన్, క్రియేట్ ఎడ్యూటెక్‌తో తెలంగాణ నార్కోటిక్ బ్యూరో అధికారులు శనివారం ఒప్పందం చేసుకున్నారు. ఈ ఆన్‌లైన్ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. 'డ్రగ్స్ ఫ్రీ వెల్‌నెస్' పేరుతో ఆన్‌లైన్ కోర్సును పూర్తి చేసిన ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఎస్ఐబీ) సుమతి కూతరు సంస్కృతి, ఇతర విద్యార్థులకు టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఎస్పీ సాయి చైతన్య సర్టిఫికెట్లను అందజేశారు.

2న 'మా తెలుగు తల్లి' వార్షికోత్సవాలు

పంజాగుట్ట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన 'మా తెలుగు తల్లి' ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సంస్థ అధ్యక్షుడు కొమర్రాజు ఉమామహేశ్వరరావు తెలిపారు. జనవరి 2న నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో సంస్థ వార్షిక మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వార్షికోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు, నగరానికి చెందిన సంగీత విద్వాంసుడు పులిపాక పూర్ణచందర్, రచయిత లక్ష్మణాచార్యులు తదితరులు పాల్గొంటారన్నారు.

కారు ఢీకొట్టడంతో సైక్లిస్ట్ మృతి

మోతీనగర్ డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనకనుంచి కారు ఢీకొన్న ఘటనలో అతడు మృతిచెందాడు. ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న గుగులోత్. గణేష్(27) నైట్ డ్యూటీ ముగించుకొని వస్తుండగా ఉదయం 7 గంటల సమయంలో మాదాపూర్ 100 ఫీట్ రోడ్డులో కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో గణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి స్వగ్రామం మహబూబ్‌నగర్ జిల్లా, కేశసముద్రం గ్రామం.

యూట్యూబర్లపై కేసు నమోదు

పంజాగుట్ట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒక వర్గాన్ని కించపరిచే విధంగా వీడియోలు చేసి అప్లోడ్ చేసిన ఇద్దరు యూ ట్యూబర్లపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరుణాకర్, ప్రవీణ్‌కుమార్ అనే యూట్యూబర్లు ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా వీడియోలు చేసి అప్‌లోడ్ చేశారంటూ ఆర్.పీటర్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం వారి కార్యాలయానికి వెళ్లగా మూసేసి ఉంది. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

బీఎస్పీ నాయకుడు మోసం చేశాడని ఆందోళన

పంజాగుట్ట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థ ముసుగులో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర నాయకుడు ప్రభాకర్ మరో మహిళతో కలిసి పేదలను, సొంత పార్టీ కార్యకర్తలను మోసం చేస్తున్నారని పలువురు ఆరోపించారు. శనివారం ఏసీ గార్డ్స్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎదుట పలువురు బాధితులు ప్లకార్డులు పట్టుకుని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో ఇళ్లు కట్టిస్తామని, నాబార్డు నుంచి వివిధ పథకాల సబ్సిడీతో పాటు డెయిరీ, వ్యవసాయ, చేపల పెంపకం కోసం రుణాలు ఇప్పిస్తానని చెప్పి ఖర్చుల పేరుతో కోట్లాది రూపాయలను వసూలు చేసి మోసం చేశారన్నారు. ప్రభాకర్‌తో పాటు కరుణోదయ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు కృష్ణమ్మపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జిగోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు 11కేవీ భారతీయ విద్యాభవన్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు 11కేవీ అపోలో ఆసుపత్రి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.



తెలంగాణ ఫిలిం ఫెడరేషన్ 24 విభాగాల నేతలతో సమావేశమైన కరుణాకర్‌రెడ్డి

తెలంగాణ సినీ కార్మికులపై వివక్ష కొనసాగుతోంది

● రాష్ట్ర ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

బంజారాహిల్స్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఏర్పాటై పదేళ్లు అయినా సినిమా ఇండస్ట్రీలో తెలంగాణ సినీ కార్మికుల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉందని తెలంగాణ ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్‌లో ఫెడరేషన్ కార్యాలయంలో ఆయన తెలంగాణ ఫిలిం ఇండస్ట్రీ 24 విభాగాల నేతలు, కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ఫిలిం ఫెడరేషన్‌లో ఈ ప్రాంతానికి చెందిన నాలుగు వేల మంది కార్మికులు వివిధ విభాగాల్లో ఉపాధి పొందుతున్నారన్నారు. సినిమా ఇండస్ట్రీలో తెలంగాణ కార్మికులు వెనుకబడి ఉన్నారంటూ ఎన్నిమార్లు సినీ పెద్దలకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిర్మాత దిల్‌రాజ్ ఫిలిం డెవపల్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కావడం ఆనందంగా ఉందని.. త్వరలోనే ఎఫ్‌డీసీ చైర్మన్‌తో పాటు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి తెలంగాణ ప్రాంత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వినతి పత్రం అందజేస్తామన్నారు.


పీజేఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత పీవీ రవిశేఖర్ రెడ్డి తదితరులు


రహ్మత్‌నగర్ ఎస్పీఆర్ హిల్స్‌లోని పీజేఆర్ ఆలయంలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తదితరులు

పేదల గుండె చప్పుడు పీజేఆర్

● కాంగ్రెస్ నేత పీవీ రవిశేఖర్ రెడ్డి

● వర్ధంతి సందర్భంగా పలువురి నివాళి

పంజాగుట్ట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేదల గుండె చప్పుడు దివంగత నేత పి.జనార్దన్ రెడ్డి(పీజేఆర్) అని కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి, ఉమ్మడి ఏపీ యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పీవీ రవిశేఖర్ రెడ్డి అన్నారు. పీజేఆర్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం వెంగళరావునగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీజేఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడు అన్వర్ ఖాన్, హైకోర్టు న్యాయవాది లక్ష్మీకాంత్ రావు, వెంగళరావునగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సన్నీగౌడ్, రాణి, నాగరాజు, ప్రదీప్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


యూసుఫ్‌గూడలో పీజేఆర్ విగ్రహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు భవానీశంకర్, గ్యార నాగరాజు, అరుణ్‌గౌడ్, జాఫర్ హుస్సేన్, సాబన్న, దేవేందర్, కిరణ్

జన 'హితం' కోసం సేవ

- గాంధీ ఆస్పత్రిలో రోగుల సహాయకులకు పునరావాస కేంద్రం
- అండగా నిలుస్తున్న సేవాట్రస్ట్

అడ్డగుట్ట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తెలుగు రాష్ట్రాలోనే గాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన రోగులు వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వస్తుంటారు. కేవలం ఓపీ విభాగంలో ప్రతిరోజు రెండు వేల మంది వైద్య పరీక్షలు చేయించుకుంటారు. దూర ప్రాంతాలు, వివిధ రాష్ట్రాల నుంచి వైద్యం కోసం వచ్చే రోగులు ఇక్కడ ఉండాలంటే బంధువుల ఇంటికో లాడ్జీలో ఉంటూ సరిపెట్టుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో గాంధీ ఆస్పత్రి ఆవరణలో మెడికల్ దుకాణాలపై ఉన్న 'జనహిత పునరావాస సేవా కేంద్రం' రోగులకు ఆసరగా నిలుస్తోంది.





గాంధీ ఆస్పత్రి ఆవరణలో జనహిత సేవా ట్రస్ట్, సేవా కేంద్రంలో రోగుల సహాయకులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

ఆస్పత్రి పాస్ చూపిస్తే చాలు..

జన హిత పునరావాస సేవా కేంద్రం రోగుల సహాయకుల కోసం సేవలందించేందుకు 2024 ఏప్రిల్‌లో ప్రారంభించారు. ఈ కేంద్రంలో జనహిత పునరవాస కేంద్రం ట్రస్టీ మేనేజర్ ఎం. నర్సింహ మూర్తి, షెల్టర్ ఇన్‌చార్జి నందకుమార్, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు దాదాపు 150 మంది రోగుల సహాయులు ఈ కేంద్రంలో సేద తీరుతున్నారు. ఆస్పత్రిలో అడ్మిట్ అయిన రోగులకు సంబంధించి గేట్ పాస్ ఉంటే చాలు ఈ కేంద్రానికి వస్తే కంప్యూటర్ ఆపరేటర్‌కు పాస్ చూపించి ఇరవై నాలుగు గంటలు ఉండేందుకు అనుమతి ఇస్తారు. కేవలం పది రూపాయాలు చార్జీ వసూలు చేస్తారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఉచితంగానే వడ్డిస్తారు. ఆస్పత్రిలో రోగులు ఎక్కువ రోజులు ఉండాల్సి వస్తే ముందుగా ఈ కేంద్రంలో సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది.

ఓపీ భవనంలో జనహిత హెల్ప్ డెస్క్

ఆస్పత్రి ఓపీ భవవనంలో జనహిత సేవ సంస్థకు సంబంధించి ఒక సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఏ డాక్టర్ ఎక్కడ ఉంటారు. ఎక్కడెక్క వైద్య పరీక్షలు చేస్తారు. రక్త పరీక్షలు ఎక్కడ చేస్తారు. ఏ రోజు ఏ డాక్టర్ ఉంటాడు అనే సమాచారం ఇస్తారు. దివ్యాంగులు నడువలేని స్తితిలో ఉన్న రోగులకు వీల్ చైర్ ఏర్పాట్లు చేస్తారు. వివిధ సమాచారం ఇక్కడ సులబంగా సమాచారం ఇస్తారు.

కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు



నాన్నగారి ఆరోగ్యం బాగలేదని గాంధీకి తీసుకొచ్చి అడ్మిట్ చేశాము. సహాయకులకు మాత్రం గాంధీలో సౌకర్యాలు కనిపించలేదు. జనహిత సేవా సంస్థలో కార్పొరేటర్ స్థాయిలో రోగుల సహాయకులకు సదుపాయాలు కల్పించింది. కేవలం పది రూపాయాలు చెల్లిస్తే చాలు ఇరవై నాలుగు గంటలు ఉండేందుకు వీలుగా ఉంది.

- రాజ కుమార్, హన్మకొండ

మంచి సదుపాయాలు ఉన్నాయి



నా కొడుకు మందు తాగాడు. పదిహేను రోజుల క్రితం గాంధీకి వచ్చాం. అక్కడ మంచి వైద్యం అందుతుంది. ఇక్కడ ఉండేందుకు వీలుగా జనహిత సంస్థ మంచి సదుపాయాలు కల్పించింది. టిఫిన్ రెండు పూటల భోజనం ఇలాంటి సదుపాయాలు ఎక్కడ లేదు. నయా పైన ఖర్చు లేకుండా ఇక్కడ ఉండవచ్చు.

-సుశీల, నర్సాపూర్, మెదక్

సాయం చేయాలనే తపన

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల సహాయకులు రోడ్లపై, చెట్లకింద సేద తీరే వాళ్లు. లేదంటే రేకులు షెడ్లకింద ఉండేవాళ్లు రాత్రి అయితే కొందరు పడుకునేందుకు బయపడేవారు. ఇలాంటి వాళ్లు ఉండేందుకు అన్ని సౌకర్యాలతో ఉన్న షెల్టర్ ఉదయం టిఫిన్, రెండు పూటల భోజనం ఉచితంగా వడ్డిస్తారు. ఎవరైనా సరే ఇక్కడ ఉండవచ్చు.

-నర్సింహ మూర్తి, ట్రస్ట్ మేనేజర్

ఆస్పత్రికి వచ్చేవారు బాధపడొద్దు



గాంధీ ఆస్పత్రికి శస్త్ర చికిత్సల కోసం వచ్చే రోగులు వారం రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉండాల్సిన పరిస్థితి. వారి సహాయకులు చెట్లకిందనో లేదంటే ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడే ఉంటున్నారు. వారిని చూసి తనకు బాదేసింది. జనహిత సంస్థ కేంద్రం ఆధ్వర్యంలో రోగుల సమాయకులకు ఐడీ చూపిస్తే చాలు ప్రవేశం కల్పిస్తాం. షెల్టర్‌లో కాలకృత్యాలు తీర్చుకోవచ్చు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం రాత్రి భోజనం కేవలం రూ. 10 రూపాయాలు చెల్లిస్తే చాలు.

- నంద కుమార్, జనహిత కేంద్రం మేనేజర్



బీదలబస్తీలో పవర్‌బోర్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పవర్‌బోర్‌కు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బౌద్ధనగర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీలో జలమండలి సిబ్బంది పవర్‌బోర్‌కు మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 22న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'బీదలబస్తీలో పనిచేయని పవర్‌బోర్-నీటి ఇబ్బందులు పడుతున్న స్థానికులు' అనే కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు శనివారం మూలనపడ్డ పవర్‌బోర్‌కు మరమ్మతులు చేపట్టారు. స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.



అడ్డగుట్ట ఏ సెక్షన్‌లో పర్యటించిన జలమండలి డిప్యూటీ జీఎం సాగర్, ఏఈ స్రవంతి

బస్తీలో పర్యటించిన జలమండలి అధికారులు

- సమస్యను పరిష్కరిస్తా: డిప్యూటీ జీఎం సాగర్

అడ్డగుట్ట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న 'శీతాకాలంలోనూ మంచినీటి కటకట' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో స్పందించిన మారేడుపల్లి జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ సాగర్, మారేడుపల్లి ఏఈ స్రవంతిలతో పాటు అధికారులు శనివారం మధ్యాహ్నం అడ్డగుట్ట ఏ సెక్షన్‌లో పర్యటించారు. మంచినీటి సమస్యలపై స్థానికులను అధికారులు అడిగి తెలుసుకున్నారు. చాలా రోజులుగా ఉదయం ఐదు గంటలకు నీటి సరఫార అవుతుందని కనీసం ఒక్క బిందె కూడా నిండడంలేదని మహిళలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే అధికారులు స్పందిస్తూ బస్తీలో వాటర్ సమస్య వెంటనే పరిష్కరిస్తానని అధికారులు మహిళలకు హామీ ఇచ్చారు. ఇక నుంచి నీటి సరఫారాలో అంతరాయం లేకుండా చూస్తామని అధికారులు తెలిపారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బౌద్ధనగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సంవత్సరం ఆఖరి శనివారం కావటంతో మూలవిరాట్ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారు దివ్యమంగళ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ చైర్మన్ నోముల ఇందిరా ప్రకాశరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జనవరి 1వ తేదీన ఆలయ ప్రాంగణంలో తిరుప్పావై సేవను నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిరుప్పావై సేవలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో బిట్ల రఘునందన్‌కుమార్, నాగులారి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బోయిన్‌పల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ వద్ద ఏర్పాటుచేసిన జనార్దన్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జంపన ప్రతాప్

పీజేఆర్‌కు ఘన నివాళి

బోయిన్‌పల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, నిరుపేదల నాయకుడు మాజీ మంత్రి పి.జనార్దన్‌రెడ్డి అని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. పి.జానర్ధన్‌రెడ్డి వర్ధంతిని న్యూబోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్ వద్ద శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ హాజరై పీజేఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ కార్మిక నాయకుడిగా కార్మికుల సంక్షేమానికి సీఎల్‌పి నేతగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం నగరానికి గోదావరి జలాల తరలింపునకు గళమెత్తిన మొదటి నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో అరుణ్ యాదవ్, సాయిబాబా యాదవ్, హరికృష్ణ, కట్టెలమండి కుమార్, వరప్రసాద్, రాజు, ముఖేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తిరుమలగిరి డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో తండ్రితో గొడవ పడిన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై దుర్గా రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మైలారం శ్రీనివాస్ జ్యోతి లక్ష్మిలు భార్య భర్తలు, బొల్లారం డౌటన్ బజార్‌లో తమ కుమారుడు భరత్ కుమార్(28) కూతుళ్లతో కలిసి నివాసం ఉంటున్నాడు. భరత్ కుమార్ మద్యానికి అలవాటు పడ్డాడు. శుక్రవారం సాయంత్రం మద్యం తాగి వచ్చి తండ్రి మైలారం శ్రీనివాస్‌తో గొడవ పడ్డాడు అనంతరం తన గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని నిద్రపోయాడు. సాయంత్రం మైలారం శ్రీనివాస్ కూతురు డ్యూటీ నుంచి రాగానే తన అన్నను పిలిచింది. ఎంత పిలిచిన పలకకపోవడంతో తలపుల మధ్యన ఉన్న రంధ్రాల నుంచి చూసింది. భరత్ కుమార్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలానికి చేరుకుని భరత్ కుమార్ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. శనివారం పోస్టుమార్టం నిర్వహించి శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



కుమారస్వామి

అడ్డగుట్ట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. తుకారాంగేట్‌కు చెందిన కుమారస్వామి(34) మతిస్థిమితంతో బాధపడుతున్నాడు. ఈ నెల 7న ఇంటి నుంచి బయటికి వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోయింది. అదేరోజు భార్య లలిత తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మొదటగా పోలీసులు రిజిస్టర్‌లో ఎంట్రీ చేసుకుని గాలించారు. పోలీసులు వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులు శనివారం కుమార స్వామి మిస్సింగ్ కేసు కింద నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డగుట్టలో మహిళ...



మాధవి

అడ్డగుట్ట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఊరెళుతున్నాని చెప్పి ఓ మహిళా కనిపించకుండా పోయిన ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం అడ్డగుట్టకు చెందిన మాధవి(35) ఈ నెల 20న జోగిపేట్‌కు వెళుతున్నాని చెప్పిన ఆమె కనిపించకుండాపోయింది. జోగిపేట్‌కు ఆమె వెళ్లలేదని కుటుంబ సభ్యులు తెలుసుకుని అదే రోజు తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు గాలించగా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులు మాదవి మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

అయ్యప్పలకు నిత్యాన్నదానం గొప్పవిషయం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామిని పూజించే అయ్యప్పలకు అల్పాహారం, నిత్యం అన్నదానం నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని ఆవులమందలోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శ్రీధర్మశాస్త భక్త బృందం ఆధ్వర్యంలో అయ్యప్పలకు నిర్వహిస్తున్న అన్నదానంలో పాల్గొన్నారు. వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయ కమిటీ రూపొందించిన 2025 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. 22 సంవత్సరాల నుంచి అయ్యప్పలకు ప్రతి రోజు సుమారు వెయ్యి మందికి మధ్యాహ్నం అన్నదానం, రాత్రి అల్పాహారం వితరణ చేస్తున్న నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, గణేష్, నాయకులు కొశికే కిషోర్, శ్రీధర్మశాస్త భక్త బృందం ప్రతినిధులు సోమ ఆనంద్, కొప్పూరి వెంకటేష్, వెంకటనారాయణ, సూర్య ప్రకాష్, ఆలయ కమిటీ అధ్యక్షులు బాలేందర్, ప్రధాన కార్యదర్శి తమ్మి వెంకటేష్, కోశాధికారి మనుసాని శరత్ కుమార్ తదిరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ముచ్చెర్ల మెన్షన్‌లో....

సరోజినీ దేవి రోడ్డులోని ముచ్చర్ల మెన్షన్ బిల్డింగ్‌లో అయ్యప్ప స్వాములకు అన్నదానంలో ఎమ్మెల్యే తలసాని, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో కలిసి పాల్గొన్నారు. ముందుగా అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీగణేశ్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, బీఆర్ఎస్ రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నిర్వాహకులు ఆనంద్ బాబు గౌడ్, ముచ్చర్ల కృష్ణ, శివనారాయణ గుప్తా, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లారం ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తాం

- ఎంపీ ఈటల రాజేందర్

తిరుమలగిరి డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆస్పత్రి పేద వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం ఆస్పత్రిని సందర్శించి వైద్య సేవలు అందుతున్న తీరును రోగులను అడిగి తెలుసుకున్నారు. కంటోన్మెంట్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆస్పత్రిలో వైద్యులు సిబ్బంది మందులు కొరత ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని కంటోన్మెంట్ బోర్డులో ప్రస్తావించి వైద్యుల సంఖ్యను పెంచడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇటీవల కాలంలో వైద్యులు ఉన్నప్పటికీ సరైన వైద్యం అందించడం లేదని ఆరోపనలు ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో వైద్య సదుపాయాలు పరికరాల సంఖ్యను పెంచడంతో పాటు మెరుగైన వైద్య సదుపాయాలు చికిత్సలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. కంటోన్మెంట్‌తో పాటు సమీప ప్రాంత ప్రజలకు ఆస్పత్రుల వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా తీర్చిదిద్దుతానన్నారు. రాత్రి పూట డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితిలో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వీటన్నింటినీ బోర్డు సమావేశంలో మాట్లాడి పరిష్కరిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు.



రోగిని వైద్య సేవలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీ ఈటల రాజేందర్

ఒడిశా టు మహారాష్ట్రకు గంజాయి సరఫరా

- సికింద్రాబాద్‌లో ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు
- 10 కిలోల గంజాయి పొడి స్వాధీనం
- ఇద్దరి అరెస్ట్.. పరారీలో ఒకరు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి సికింద్రాబాద్ మీదగా మహారాష్ట్రకు రైలులో పొడి గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తుల్ని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేశారని సికింద్రాబాద్ రైల్వే డీస్పీ జావీద్, సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపారు. మరొకరు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. శనివారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీస్పీ జావీద్, సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్ మాట్లాడారు. ఉత్తర్‌ప్రదేశ్ బండ జిల్లా ఫైలానీ బారగాన్ గ్రామానికి చెందిన మోహిత్ (29), అరుణ్ కుమార్(28), దిపక్‌కుమార్(22) ముగ్గురు కలిసి ఒడిశా నుంచి 10.143 కిలోల పొడి గంజాయి సరుకును కొనుగోలు చేశారు. విశాఖపట్నం నుంచి ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైలులో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా మహారాష్ట్రకు సరుకుతో బయలుదేరారు. శుక్రవారం రాత్రి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్లాట్ ఫాం నంబరు 2లో ఆగింది. శనివారం రాత్రి ఎల్‌టీటీ రైలులో జనరల్ కోచ్‌లో సికింద్రాబాద్ రైల్వే పోలీసులు తనిఖీలు చేస్తుండగా మోహిత్ అక్కడి నుంచి పారిపోగా పోలీసులకు అరుణ్‌కుమార్, దీపక్ కుమార్ పట్టుబడ్డారు. వీరి నుంచి 10.143 కిలోల పొడి గంజాయి ఉన్న బ్యాగులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సరుకు విలువ రూ. 2.52 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మోహిత్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. పట్టుబడిన ఇద్దరిని పోలీసులు రిమాండుకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



అరెస్టు చేసిన ఇద్దరు నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయిని చేపుతున్న రైల్వే పోలీసులు

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన పెరగాలి

- నాసిరకం పరికరాలతోనే అధిక ప్రమాదాలు
- ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రజలు, కాంట్రాక్టర్లలో అవగాహన పెరగాలని తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి పేర్కొన్నారు. నాసిరకం విద్యుత్ పరికరాలు, తీగలతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని పలు ఎలక్ట్రికల్ వస్తువుల తయారీ కంపెనీల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర వస్తువుల తయారీ, నాణ్యతను ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈసీ రెడ్డి, సభ్యులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్‌లో పెద్దఎత్తున భారీ భవనాలు నిర్మాణమవుతున్న క్రమంలో ఆయా భవనాల్లో వినియోగించే విద్యుత్ తీగల నాణ్యత, ట్రాన్స్‌ఫార్మర్లు, అండర్ గ్రౌండ్ కేబులింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముందన్నారు. రెండేళ్లుగా జరుగుతున్న అగ్నిప్రమాదాల్లో 60 శాతం నిర్లక్ష్యం కారణంగా జరిగితే, 40 శాతం ప్రమాదాలు విద్యుత్ తీగలు, పరికరాల నాణ్యత లోపాలతో జరిగినట్లు ప్రాథమికంగా తేలిందన్నారు. బీఐఎస్ ప్రమాణాలతో తయారు చేసిన ఎలక్ట్రిక్ ఉపకరణాలనే వినియోగించాలని ఆయన సూచించారు. లైసెన్స్ పొందిన కాంట్రాక్టర్లు, ఎలక్ట్రీషియన్లతో మాత్రమే విద్యుత్ మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు మహేందర్, శ్రీనివాస్ రెడ్డి, వేణుబాబు పాల్గొన్నారు.



దర్గాకు మొక్కులు సమర్పిస్తున్న నాయకులు

బొల్లారంలో గ్యార్వీ వేడుకలు

తిరుమలగిరి డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బొల్లారం కొత్త బస్తీలోని హజరత్ సయ్యద్ భాజీ షాహిద్ బాబా దర్గా గ్యార్వీ వేడుకలు శుక్రవారం రాత్రి వైభవంగా జరిగాయి. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పూలదండలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా మీద పూల చాదర్ కప్పి గులాబీ పూలు సమర్పించి తన మొక్కులు చెల్లించుకున్నారు జ్ఞానేశ్వర్. అనంతరం అన్నదానం నిర్వహించారు. అన్నదానంలో మహిళలు పురుషులు సుమారు 500 మంది పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకుడు ముప్పిడి మధుకర్, టీడీపీ నాయకుడు ప్రతాప్, జనగామ నర్సింగ రావు, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ అయిత్ భాయ్, ఇబ్రహీం, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో సమాజ్‌వాది పార్టీ బలోపేతానికి కృషి

- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి

తార్నాక, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమాజ్‌వాది పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలను చైతన్యపరుస్తూ పార్టీ బలోపేతానికై కృషి చేస్తామని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.ఎస్. సింహాద్రి అన్నారు. శనివారం తార్నాకలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రొ. సింహాద్రి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలతో చర్చా కార్యాక్రమాలను ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా సమాజ్‌వాది పార్టీని బలోపేతం చేయాలని అఖిలేష్ యాదవ్ ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను కించపరిచేవిదంగా వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని భారతజాతికి క్షమాపణలు చేప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అక్కల బాబు గౌడ్, బరిగెల స్వరూప రాణి, శ్రీహరి ముదిరాజ్, బోనాల విజయ్‌కుమార్, దేవని జ్యోతి, గణేష్ ముదిరాజ్, ప్రొ. వెంకట్రాజయ్య మేకల బాలు యాదవ్, మహమ్మద్ బేగ్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. ఎస్. సింహాద్రి, తదితరులు

సీఎం వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

బౌద్ధనగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఎం వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సీతాఫల్‌మండికి చెందిన విద్యార్థి ప్రతిభను చాటాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ ఆథారిటి ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో లాల్‌బహదూర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న జీఎం రేవంత్ 67 కిలోల విభాగంలో స్నాచ్ 90 కేజీలు, క్లీన్ అండ్ జర్క్ 110కిలోలు ఎత్తి రెండోస్థానంలో నిలిచాడు. దీంతో హైదరాబాద్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, కోచ్‌లు శివకుమార్, శ్రవణ్, రాజు, హేమలత, రేవంత్‌ను అభినందించారు.



సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న జీఎం రేవంత్



డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న చింతబావి వాసులు

కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలి

చిలకలగూడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ చింతబావి, దూద్‌బావిలో కలుషితనీటి సమస్యలను పరిష్కారించాలని బస్తీ మహిళలు డిప్యూటీ మేయర్‌ను కలిశారు. శనివారం తార్నాకలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతరెడ్డిని మహిళలు కలిసి వినతిపత్రం సమర్పించారు. దూద్‌బావి, చింతబావిలో కలుషిత, మంచినీటి సమస్య విపరీతంగా ఉందని, పలు ఇబ్బందులు పడుతున్నామని బస్తీ మహిళలు డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. జలమండలి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని డిప్యూటీ మేయర్ బస్తీ మహిళలకు హామీ ఇచ్చారు.